సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 9 । జూలై । 2023



వంటకు ధరల సెగ

కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితికి చేరుకున్నాయి. 8లో▸



మందపై కుక్కల దాడి..

గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన గుండాలలో జరిగింది. 8లో▸



నూతన నియామకం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొయినాబాద్‌కు చెందిన రామచందర్ నియమితులయ్యారు. 8లో▸

న్యూస్‌రీల్

మొయినాబాద్‌లో యాదిరెడ్డి విగ్రహం ఏర్పాటు

ఎంపీ రంజిత్‌రెడ్డి వెల్లడి



యాదిరెడ్డి తల్లి చంద్రమ్మకు ఇంటి పట్టాలు అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మొయినాబాద్: త్వరలోనే మొయినాబాద్ చౌరస్తాలో తెలంగాణ అమరవీరుడు మందడి యాదిరెడ్డి విగ్రహం పెడతామని ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో అమరుడు యాదిరెడ్డి తల్లి చంద్రమ్మకు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతులమీదుగా శనివారం డబుల్ బెడ్‌రూం ఇల్లు, పెద్దమంగళారంలో 500 గజాల ఇంటి స్థలం పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా యాదిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలోనే యాదిరెడ్డి తల్లి చంద్రమ్మకు పింఛన్ అందించే ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి, ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, మాజీ జెడ్పీటీసీ కొంపలి అనంతరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, మాజీ వైస్ చైర్మన్ దప్పు రాజు, డైరెక్టర్లు మహేశ్‌యాదవ్, రాజుగౌడ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం కరువు

కాంగ్రెస్ సీనియర్ నేత హన్మంతరావు



క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత హన్మంతరావు తదితరులు

షాద్‌నగర్: రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో 18 రోజులుగా నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి శనివారం విచ్చేసిన ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి, క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దీంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కప్ అంటూ ప్రచారాలు మాత్రమే చేసిందని, క్రీడాకారులకు ఒరిగిందేమీ లేదన్నారు. గ్రామాల్లో ఎంతో ఆర్భాటంగా క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినా అందులో క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు, క్రీడా సామగ్రిని సమకూర్చలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దినేష్ సాగర్, సుధీర్, శ్రీకాంత్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు లష్కర్ బోనాలు



ముస్తాబైన అమ్మవారి దేవాలయం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఆషాఢమాస జాతరలో భాగంగా ఆదివారం బోనాలు, సోమవారం రంగం కార్యక్రమం జరగనున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టాయి. ఈ సందర్భంగా మహంకాళి దేవాలయాన్ని విద్యుద్దీపాలు, పూలు, పండ్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం 3.30 గంటలకు అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా తొలిపూజ, హారతిలో పాల్గొంటారు.

సార్లు లేక.. అర్థం కాక

జిల్లాలో 350కి పైగా టీచర్ పోస్టులు ఖాళీ

- ఉన్న ఉపాధ్యాయులపై తప్పని భారం
- ఒక్కో టీచర్ రెండు, మూడు సబ్జెక్టుల బోధన
- పాఠాలు అర్థం కాక విద్యార్థుల అయోమయం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ పాఠశాలలను సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఫలితంగా ఇంగ్లిష్ టీచర్ తెలుగు.. సైన్స్ టీచర్ మ్యాథ్స్.. సోషల్ టీచర్ హిందీ సబ్జెక్టులు బోధించాల్సి వస్తోంది. సబ్జెక్టుతో సంబంధం లేని టీచర్లు పాఠ్యాంశాలు బోధిస్తుండటంతో అర్థం కాక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. గత విద్యా సంవత్సరం టెన్త్ ఉత్తీర్ణత శాతం తగ్గడానికి ఇదే కారణం. ప్రభుత్వ పాఠశాల్లోలనే కాదు కేజీబీవీ హాస్టళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, మోడల్ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కోవిడ్‌తో రెండేళ్ల నుంచి విద్యావలంటీర్ల నియామక ప్రక్రియ నిలిచిపోయింది. కొత్తగా ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ చేయకపోవడంతో ఆయా పాఠశాలల్లో పాఠ్యాంశాలు బోధించే టీచర్లు లేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

350పైగా టీచర్ పోస్టులు ఖాళీ

జిల్లాలో 350కి పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరి స్థానంలో విద్యావలంటీర్లను కూడా నియమించకపోవడంతో ఉన్న ఒకరిద్దరు ఉపాధ్యాయులపై పని భారం తప్పడం లేదు. అనేక మంది అభ్యర్థులు ఇప్పటికే టీటీసీ, బీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన టెట్ పరీక్ష కూడా రాశారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయక పోవడంతో వారికి నిరీక్షణ తప్పడం లేదు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోగా, తాత్కాలికంగా వారి స్థానంలో విద్యావలంటీర్లను నియమించేందుకు కూడా అనుమతి ఇవ్వక పోవడంతో సకాలంలో పాఠ్యాంశాలు పూర్తికావడం లేదు. సుమారు 350 మంది విద్యార్థులు చదువుతున్న మజీద్‌పూజ్ స్కూల్లో ఏడాదిగా సోషల్ టీచర్ లేరు. విధిలేని పరిస్థితుల్లో ఇంగ్లిష్ టీచర్ (హెచ్‌ఎం) బోధించాల్సి వస్తోంది. నందిగామ, తలకొండపల్లి, మంచాల మండల పరిధిలోని ప్రభుత్వ స్కూళ్లలోనూ ఇదే పరిస్థితి.

గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానం

నిజానికి ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. జిల్లాలో ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలలోనూ అలా లేరు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ ఇలా మొత్తం 2,863 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 6,84,037 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో 37,018 మంది టీచింగ్, 6,773 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే పరిస్థితి అధ్వానంగా తయారైంది. జిల్లాలో 1,309 ప్రభుత్వ పాఠశాలు ఉంటే వీటిలో 6,846 మంది టీచింగ్, 303 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. అర్బన్ ప్రాంతాల్లో సబ్జెక్టు టీచర్ల విషయంలో పెద్ద సమస్య లేదు కానీ విద్యార్థుల నిష్పత్తి ఎక్కువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో మాత్రం టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇతర జిల్లాల నుంచి డిప్యూటేషన్లపై వచ్చిన వారు కూడా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న స్కూళ్లనే ఎంపిక చేసుకుంటున్నారు.

120 మందిని సర్దుబాటు చేశాం

జిల్లాలో ఉపాధ్యాయులకు కొరత లేదు. విద్యార్థుల నిష్పత్తికి మించి ఉన్నారు. 6,500 మందికిపైగా పని చేస్తున్నారు. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్న చోట 120 మంది టీచర్లను అడ్జెస్ట్ చేశాం. పాఠ్యాంశాల బోధన విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. కోవిడ్ కారణంగా గత విద్యా సంవత్సరం కొంత ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఏడాది పాఠ్యాంశాల బోధన పటిష్టంగా చేపట్టి, ఉత్తీర్ణత శాతం పెంచుతాం.



– సుశీందర్‌రావు, డీఈఓ



మహేశ్వరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

ఎడ్యుకేషన్ హబ్‌గా మహేశ్వరం

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. కేసీ తండా సమీపంలో నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్, మోడల్ స్కూల్ హాస్టల్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మహేశ్వరంలో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల, కస్తుర్బా పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డైట్ కళాశాల, ఎస్టీ గురుకుల హాస్టల్, మోడల్ స్కూల్, హాస్టల్‌ను ప్రారంభించామని.. ఇటీవల సీఎం కేసీఆర్ మెడికల్ కళాశాల మంజూరు చేశారని గుర్తుచేశారు. త్వరలో యూనివర్సిటీ రాబోతోందని ఆమె వెల్లడించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేటుకు దీటుగా మారుతున్నాయని తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మోడల్ స్కూల్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లు బి.ధనుంజయ్, భవాని, ఎంఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కంపెనీలో అగ్నిప్రమాదం



కంపెనీలో ఎగిసిపడుతున్న అగ్నికీలలు

- కాలిబూడిదైన గ్లాస్‌ల తయారీ పరికరాలు, ముడిసరుకు
- కార్మికులకు తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం: ప్లాస్టిక్ గ్లాసుల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు నాలుగున్నర గంటల పాటు మంటలు ఎగిసిపడ్డా. ఈ ప్రమాదంలో కంపెనీ పూర్తిగా దగ్ధమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌పల్లి, శేరిగూడ గేట్ సమీపంలోని రిషబ్ ప్లాస్టిక్ ఇండస్ట్రీలో గ్లాస్‌లను తయారు చేస్తారు. సుమారు 20 మంది కార్మికులు పనిచేస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా యంత్ర పరికరం (మిషన్) వేడెక్కి మంటలు అంటుకున్నాయి. దీంతో పనిచేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురై బయటకు పరుగులు తీశారు. నాలుగు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేసేందుకు సుమారు నాలుగు గంటల పాటు శ్రమించాయి. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రేకుల షెడ్‌లో ఉన్న ఈ కంపెనీలోని మూడు యూనిట్లలో ఉన్న యంత్ర పరికరాలు, గ్లాసులు, ముడిసరకు అగ్నికి ఆహుతయ్యాయి. షెడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అన్నదమ్ములైన నరేష్, భూపేష్, సంతోష్, గౌతమ్ ఈ కంపెనీ యజమానులు. లక్షలాది రూపాయల ఆస్తి బుగ్గిపాలైంది. నష్టం వివరాలను అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గిరిజన గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

మేడిపల్లి: రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం (2023–24)లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ కల్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 బాలికల కోసం రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయం రాజేంద్రనగర్, 11న కొత్తూరు బాలుర కళాశాల నాదర్‌గుల్ వద్ద ఉదయం 11 గంటల లోపు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

పిల్లలకు బండిస్తే ఇబ్బందే

గత నెలలో 203 మంది మైనర్ డ్రైవర్లపై చార్జీషీట్లు

- జూన్‌లో 2,818 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
- 400 మంది మందుబాబులకు జైలు శిక్ష
- 44 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు



సాక్షి, సిటీబ్యూరో: మద్యం మత్తులో వాహనాలు నడపడం, మైనర్లు డ్రైవింగ్ చేస్తుండటంతో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చార్జీషీట్లు దాఖలు చేయడంతో పాటు ఆయా వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తున్నారు. గత నెలలో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 203 మంది మైనర్ డ్రైవర్లపై పోలీసులు చార్జీషీట్లు దాఖలు చేశారు. ఇందులో 195 మందికి న్యాయస్థానం సామాజిక సేవ చేయాలని ఆదేశించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 682 మంది, నంబరు ప్లేట్ సరిగా లేని 60 మంది, 25 మంది అనధికారిక వాహనదారులు, 106 వాహన యజమానులపై కూడా సిటీ పోలీసులు చార్జీషీట్లు దాఖలు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు ఆయా ఉల్లంఘనదారులకు రూ.10,04,700 జరిమానా విధించింది.

2,818 డీడీ కేసులు..

జూన్‌లో సిటీ కమిషనరేట్ పరిధిలో 2,818 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. అంతకు క్రితం నెలలోని డీడీ కేసులతో కలిపి మొత్తం 4,321 డీడీ కేసులలో పోలీసులు చార్జీషీట్లు దాఖలు చేసి, నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఇందులో 400 మంది మందుబాబులకు కోర్టు 1–7 రోజుల వరకు జైలు శిక్ష విధించగా.. మిగిలిన 3,921 మందికి రూ.93,19,500 జరిమానా విధించింది. అలాగే 44 మంది మందుబాబుల డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసింది.

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్..

- నిందితుడి రిమాండ్

కందుకూరు: నకిలీ ఆధార్ కార్డు, నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సృష్టించిన ఓ వ్యక్తి తన పేరుతో వేరే వారి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని, మళ్లీ మోసపూరితంగా దాన్ని ఇతరులకు విక్రయించిన ఘటనలో నిందితుల్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన బూచిరెడ్డి శ్రీమతమ్మకు అదే రెవెన్యూలోని సర్వే నంబర్లు 221/అ,222/అ,236, 237/అలో 3.30 ఎకరాల భూమి ఉంది. ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తోంది. ధన్నారానికి చెందిన చుక్కా శ్రీకాంత్‌గౌడ్ (34) 2019లో ఆ భూమిని విక్రయిస్తానని చెప్పి పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్‌ను వారి నుంచి తీసుకున్నాడు. అనంతరం హైదరాబాద్ రామంతాపూర్‌లో నివసిస్తున్న వరంగల్ జిల్లా తొర్రూర్‌కు చెందిన రెబెల్లి అంబాజీ అలియాస్ అంబికా అనే మహిళ ఫొటోతో శ్రీమతమ్మ ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం నకిలీ తయారు చేయించాడు. అదే ఏడాది ఆ మహిళ సాయంతో తన పేరుపై అగ్రిమెంట్ కమ్ జీపీఏ డాక్యుమెంట్ చేయించుకున్నాడు. ఆ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ధన్నారానికి చెందిన నీలం యాదగిరితో పాటు ఇతరుల సహకారం తీసుకున్నాడు. అనంతరం ఆ భూమిని రవీంద్రనాథ్ అనే వ్యక్తికి మోసపూరితంగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేశాడు. ధరణిలో తన భూమి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన బూచిరెడ్డి శ్రీమతమ్మ మే 5న కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు చుక్క శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు నీలం యాదగిరి, రెబెల్లి అంబాజీని శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ నరేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

గతంలో పలు కేసులు

శ్రీకాంత్‌గౌడ్ మురళీనగర్ రెవెన్యూలో 16.01 ఎకరాల భూమిని ఇదే తరహాలో నకిలీ ఆధార్, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించాడు. ఫిబ్రవరి 25న శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు మరో నలుగురిని పోలీసులు రిమాండ్‌కు సైతం తరలించారు. నిందితుడు గతంలో ఓ రియల్టర్ హత్య కేసులోనూ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

ఓటరు నమోదులో సమస్యలా?

- 1950కు ఫోన్ కొట్టండి
- నివాసిత సంఘాల ప్రతినిధులు నమోదు దరఖాస్తులు తీసుకోవద్దు
- అది ఈఆర్‌ఓల బాధ్యత
- తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతో కీలకమైన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు చేర్పులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా నిర్ణీత గడువులోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో గేటెడ్ కమ్యూనిటీలు, నివాసిత సంక్షేమ సంఘాల (ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధులతో పాటు జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓ), ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్‌ఓ)లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేర్లు నమోదు చేసుకునేలా చొరవ చూపాలని నివాసిత సంఘాల ప్రతినిధులను కోరారు. అయితే ఓటర్ల నమోదు కోసం సంబంధిత అధికారులు నిర్ణీత నమూనా ఫారాలను వారే స్వయంగా స్వీకరిస్తారని, అసోసియేషన్ల ప్రతినిధులు కొత్త ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించకూడదని సూచించారు. ఓటర్లు ఎంతో సులభంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పిదాలు ఉంటే వాటిని సరి చేసుకోవడం, చిరునామా మార్పు, పోలింగ్ శాతాన్ని పెంచాల్సిన ఆవశ్యకత తదితర అంశాలపై డీఈఓ, ఈఆర్‌ఓలకు అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు సీఈఓ లోకేష్ కుమార్, సంయుక్త సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అదనపు కమిషనర్ అవినాష్ మహంతి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్ రోస్, రంగారెడ్డి కలెక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అలలపై సమరాంగణం

- ముగిసిన సెయిలింగ్ పోటీలు
- జాతీయ స్థాయి పోటీలకు వేదికైన హుస్సేన్‌సాగర్
- గవర్నర్ చేతుల మీదుగా ట్రోఫీ ప్రదానం నేడు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్‌సాగర్ ఈఎంఈ సెయిలింగ్ క్లబ్ వేదికగా వారం రోజులుగా కొనసాగిన ప్రతిష్టాత్మక 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్' పోటీలు శనివారం ముగిశాయి. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లేసర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల క్లబ్‌ల నుంచి దాదాపు వంద మంది సెయిలర్స్ పాల్గొన్నారు. చివరి రోజు శనివారం 10, 11, 12వ రేసులను పూర్తి చేశారు. లేజర్‌స్టాండర్డ్, లేజర్ రేడియల్, లేజర్ 4.7 విభాగాల్లో మొత్తం 12 రేసులను పూర్తి చేశామని ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. విజేతలకు గవర్నర్ ఆదివారం ట్రోఫీలను ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అర్జున అవార్డు గ్రహీత, రిటైర్డ్ కెప్టెన్ రాజేష్ చౌదరి మాట్లాడుతూ.. భారీగా వీచిన గాలిలో, తేలికపాటి గాలిలో కూడా నావికులు అద్భుత ప్రదర్శనను కనబరిచారన్నారు. చివరి రోజు 3 విభాగాల్లోన్ని రేసుల్లో అద్వైత్ మీనన్, కోటేశ్వర్ రావు, కీర్తి తదితర సెయిలర్స్ తమ నైపుణ్యాలను ప్రదర్శించారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని నాలుగు బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) యాదయ్యగౌడ్, ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ప్రాంతీయ ఆర్‌సీఓ ఆదిత్యనాథ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ సంక్షేమ గురుకుల హైదరాబాద్ (మహిళలు), మేడ్చల్ (మహిళలు), కందుకూరు (పురుషులు), వికారాబాద్ (పురుషులు, మహిళలు) డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అర్హులైన పీజీ పూర్తి చేసిన మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, మాథమ్యాటిక్స్, ఫిజిక్స్, బోటని, జువాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, మైక్రో బయాలజీ, జియాలజీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, హెల్త్ సూపర్ వైజర్, స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్/ స్లాట్ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో పనిచేసిన అనుభవం కలిగి ఉండాలని, అభ్యర్థులు దరఖాస్తుతో పాటు పీజీ సర్టిఫికెట్లు, పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్, స్లాట్, సర్వీసు సర్టిఫికెట్లను జతపరచాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జులై 12వ తేదీ వరకు జిల్లాలోని ప్రాంతీయ సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) కార్యాలయంలో లేదా ఎంజేపీ డిగ్రీ కళా.శాలలో అందించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 99892 69715, 94900 52739, 94416 77458, 80088 05315లలో సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూలకు ఫోన్ నంబర్లకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

వంటకు ధరల సెగ

- అమాంతం పెరిగిన కూరగాయల రేట్లు
- ఏది కొనాలన్నా కిలో రూ. 80 పైమాటే
- టమాటా రూ.150, పచ్చిమిర్చి రూ.120
- సామాన్యుడు కొనలేని పరిస్థితి
- సాగు విస్తీర్ణం పడిపోవడం, దిగుమతి లేకపోవడమే కారణం



పరిగి మార్కెట్‌లో కూరగాయల విక్రయం

పరిగి: కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితికి చేరుకున్నాయి. ఏది అడిగినా రూ. 80 పైనే చెబుతున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతినడం, మన రాష్ట్రంలో అవసరం మేరకు దిగుబడి లేకపోవడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. దీంతో రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి. 15 రోజులుగా ధరల ఏ మాత్రం తగ్గకపోగా పైపెచ్చు పెరుగుతున్నాయి. కూరగాయాల సాగు కూడా పడిపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని పలువురు పేర్కొన్నారు. కిలో టమాటా రూ.120 నుంచి 150 వరకు పలుకుతోంది. పచ్చి మిర్చి రూ. 120పైకి పైమాటే.

ఉత్పత్తి పడిపోవడంతోనే..

నెల రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు కురగాయల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ కారణంగా ఉత్పత్తి పడిపోయింది. దీంతో వంటలో అధికంగా వినియోగించే పచ్చి మిర్చి, టమాటా ధరలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి నిత్యం కూరగాయలు భారీగా దిగుమతి అవుతుంటాయి. పక్క రాష్ట్రాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుమతి తగ్గి నగరానికి పచ్చి మిర్చి, టమాటాలు రావడం తగ్గిపోయింది. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతోంది.

రికార్డు స్థాయిలో రేట్లు

20 సంవత్సరాలుగా ఇంత భారీగా కూరగాయల రేట్లు ఎన్నడూ పలకలేదు. పరిగి మార్కెట్‌లో శుక్రవారం కిలో టమాటా రూ. 120నుంచి రూ. 150వరకు విక్రయించారు. పచ్చి మిర్చి రూ. 120వరకు అమ్ముతున్నారు. మిగతా కూరగాయలు కనీసం రూ. 80 పైమాటే. భారీగా రేట్లు పెరగడంతో సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోజు కూలి పని చేసుకుని జీవించే వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. కూరగాయల ధరలు పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన నియామకం



ఆర్ కృష్ణయ్యను సన్మానిస్తున్న రామచందర్

మొయినాబాద్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొయినాబాద్‌కు చెందిన కుమ్మరి రామచందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం నగరంలో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని రామచంద్రర్ ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఆర్ కృష్ణయ్యను సన్మానించారు.

నేడు సామూహిక వివాహాలు

రాజేంద్రనగర్: మైనారిటీ డెవలప్‌మెట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక వివాహ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రటకనలో తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హసన్‌నగర్ నూరానీ మసీద్ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 13 నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఈ వివాహాలు జరిపిస్తున్నామని తెలిపారు.

కేజీబీవీలో ఇంటర్మీడియెట్ కోర్సులు

స్పెషల్ ఆఫీసర్ కృష్ణకుమారి

షాబాద్: షాబాద్ కేజీబీవీలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణకుమారి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామీణ బాలికలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌డబ్ల్యు (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్), సీఈసీ కోర్సులు ఈ అకాడమిక్ ఇయర్ నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీలోపు విద్యార్థులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మందపై కుక్కల దాడి.. 30 గొర్రెలు మృతి



గుండాలలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

చేవెళ్ల: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన సంఘటనలో 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన చేవెళ్ల మండలం గుండాలలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం .. గుండాల గ్రామానికి చెందిన జెట్ట రామచంద్రి గొర్రెలను పోషించుకుంటూ జీవిస్తున్నాడు. దాదాపు 60 వరకు గొర్రెలు ఉన్నాయి. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం కూడా గొర్రెలను మేపుకొని వచ్చి ఒక చోట మందగా వేసి రాత్రి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి కొరికి చంపేశాయి. మొత్తం 30 గొర్రెలు మృతి చెందాయి.